క్లుప్తంగా

నేడు వీఎంసీ 'స్పందన'

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రతి వారం జరిగే స్పందనలో నగరవాసులు తమ ప్రాంతాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్, సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు నగరవాసుల నుంచి ఫిర్యాదులు, అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. నగరవాసులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కమిషనర్ సూచించారు.

నేడు కార్మిక చట్టాలపై అవగాహన సదస్సు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): స్థానిక మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్ సమీపంలోని తమ సంస్థ ఆవరణలో సోమవారం ఉదయం 11.30 గంటలకు కార్మిక చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.స్వరూపరాణి, ఎంబీవీకే భవన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు పి.క్రాంతికుమార్, జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ ఎస్.విద్యాకన్న అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల వారు సదస్సుకు హాజరు కావాలన్నారు.

శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి వారికి రూ.లక్ష విరాళం



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం ఆలయ పునర్నిర్మాణం నిమిత్తం సత్యనారాయణపురం వర్తక సంఘం అధ్యక్షుడు మైలవరపు రాము, పద్మావతి దంపతులు రూ.1,01,116 విరాళం అందజేశారు. ఈ మేరకు ఆదివారం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొల్లూరు రామకృష్ణకు నగదును అందించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు దాతలకు స్వామివార్ల దర్శనం చేయించి వేద పండితులచే ఆశీర్వచనాలు అందజేశారు.

6 నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 6 నుంచి నెల రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లిష్ ఉచిత తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ యూ.వి.రామరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పోకెన్ ఇంగ్లిష్ బోధనలో 20 ఏళ్ల అనుభవంతో పాటు అనేక కార్పొరేట్ కంపెనీల్లో సెమినార్లు నిర్వహించిన అనుభవం కలిగిన పాగోలు రాజు తరగతులు బోధిస్తారని చెప్పారు. ఎల్‌సీడీ ప్రొజెక్టర్ ద్వారా ఆధునిక పద్ధతుల్లో సులభతరంగా బోధించడం, ప్రతి రోజు ఇంగ్లిషులో మాట్లాడటంపై సాధన చేయిస్తారన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, గృహిణులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆసక్తి కలవారు ఈ నెల 5వ తేదీ లోగా తమ కార్యాలయంలో గానీ, 0866 2578044, 63059 54249 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): హైదరాబాద్ ఓల్డ్ బోయినపల్లికి చెందిన రాధా నృత్యనిలయానికి చెందిన కళాకారులు ప్రదర్శించిన భరత నాట్య నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం నృత్య ప్రదర్శన జరిగింది. నృత్య నిలయానికి చెందిన 20 మంది కళాకారులు పలు కీర్తనలకు భరత నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. విద్యాధరపురం చెరువు సెంటర్‌కు చెందిన చింతట మోహన్‌రావు కొంతకాలం జైహింద్ కాంప్లెక్స్‌లోని బంగారం షాపులో సేల్స్‌మేన్‌గా పనిచేశాడు. పక్షవాతం రావడంతో ఇంటి వద్దనే ఉంటున్నారు. ప్రతి రోజూ ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రానికి తిరిగి వచ్చేవాడు. శనివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వారిని, బంధువులను విచారించినా ఆచూకీ తెలియలేదు. మోహన్‌రావు తనయుడు పవన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

వైభవంగా వాసవీ మాత జయంతి

- సామూహిక కుంకుమార్చనలు
- శాస్త్రోక్తంగా అమ్మవారికి పూజలు



వాసవీ మాత రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలంపల్లి, భక్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతోత్సవాలను పశ్చిమ నియోజకవర్గంలో ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వన్‌టౌన్‌లోని వివిధ సంస్థలు, ఆలయాల ఆధ్వర్యంలో అమ్మవారం జయంతి కార్యక్రమాలను జరిపారు. ఈ సందర్భంగా కుంకుమార్చనలు, ప్రత్యేక అభిషేకాలు, హోమాలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

శ్రీ కృష్ణ ప్రార్థనా సంఘం ఆధ్వర్యంలో..

వన్‌టౌన్ శేషయ్యవీధిలోని శ్రీ కృష్ణ ప్రార్థనా మందిరంలో శ్రీ వాసవీ అమ్మవారి జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పవిత్ర జలాలతో అభిషేకాలు, విశేష అర్చనలను నిర్వహించారు. అనంతరం 108 మహిళలు సామూహికంగా కుంకుమార్చనలను జరిపారు. లలితా సహస్రనామాలతో అర్చక స్వాములు కుంకుమార్చనలను నిర్వహింపజేశారు. కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలకు పూజా సామగ్రితో పాటుగా చీరను ఉచితంగా పంపిణీ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. జయంతి ఉత్సవంలో పలువురు ప్రముఖులు పాల్గొని పూజలు నిర్వహించారు. అమ్మవారిని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పల్లపోతు మురళీకృష్ణ, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు గుడిపాటి కిషోర్ తదితరులు దర్శించుకున్నారు. కార్యక్రమాలను కమిటీ అధ్యక్షుడు గోకవరపు మురళీకృష్ణ, కార్యదర్శి గుడిపాటి పాపారావు పర్యవేక్షించారు.

అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలో....

శ్రీ కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అభిషేకాలను శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం అమ్మవారికి రజితకవచాలంకారాన్ని చేసి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. పూజా కార్యక్రమాల అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బచ్చు వెంకటప్రసాద్, బయన శ్రీరాజేష్‌లు పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు వల్లంకొండ వీరముని బ్రహ్మానందరావు, వల్లంకొండ ప్రసాద్, డోగిపర్తి శంకరరావు, చల్లా హరినారాయణ పాల్గొన్నారు.

కొత్తగుళ్ల ప్రాంగణంలో...

కొత్తగుళ్ల ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చనలను నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఆలయంలో విశేష పూజలు జరిపారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, ఆర్యవైశ్య సంఘం నగర అధ్యక్షుడు పల్లపోతు మురళీకృష్ణ, ఆర్య వైశ్య యువజన విభాగ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్ పాల్గొన్నారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): వాసవీ క్లబ్ విజయవాడ విద్యాధరపురం ఆధ్వర్యంలో స్థానిక గుప్తా సెంటర్‌లోని శ్రీకన్యక పరమేశ్వరి కల్యాణమండపంలో అమ్మవారికి 108 కలశాలతో పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా మజ్జిగ పంపిణీ, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వీధి వ్యాపారస్తులకు గొడుగులు అందజేశారు.



శ్రీ కృష్ణ ప్రార్థనా సంఘం ప్రాంగణంలో కుంకుమార్చనలు పర్యవేక్షిస్తున్న నిర్వాహకులు



మజ్జిగ పంపిణీ చేస్తున్న డీపీఓ ప్రభావతి

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ మిత్తింటి శారద, డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మాటూరు ప్రభావతి, జిల్లా సెక్రటరీ అనంతుల ఇందిర, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వంకాయల పూర్ణచంద్రరావు, కందెపు ప్రవీణ్‌కుమార్, కోశాధికారి సముద్రాల పుల్లారావు, కొత్తమాసు పిచ్చయ్య పాల్గొన్నారు.

కనుల పండువగా ఆదిదంపతుల కల్యాణం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కరుమారి అమ్మన్ శక్తిపీఠంలో నిర్వహిస్తున్న సహస్ర చండీయాగ ప్రాంగణంలో ఆదివారం శివపార్వతుల కల్యాణం కనులపండువగా జరిగింది. పాలప్రాజెక్టు సమీపంలోని నైనవరం ఫ్లై ఓవర్ వద్ద శ్రీదేవి కరుమారి అమ్మన్ శక్తిపీఠంలో సహస్ర చండీయాగం వైభవంగా జరుగుతోంది. ఆదివారం కల్యాణ వేదికపై శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణ వేదిక వద్ద ముత్తయిదువలు, ఉభయదాతలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్, చండీయాగం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పి.గౌతమ్‌రెడ్డి, గజల్ శ్రీనివాస్ ఉత్సవాలను పర్యవేక్షించారు. దుర్గగుడి స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్‌శర్మ నేతృత్వంలో 80 మంది ఋత్వికులు యాతకక్రతువును నిర్వహించారు. ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరాగా, వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పీఠం పీఠాధిపతి కరుమారి దాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



వేదికపై ఆది దంపతుల కల్యాణోత్సవం

సౌమ్యకు ది డ్యాన్స్ ఇండియా యంగ్ టీచర్ అవార్డ్



సౌమ్యకు అవార్డ్ ప్రదానం చేస్తున్న జీవన్, వజానా ఉదయ్, కిరణ్మయి బోనాల

విజయవాడకల్చరల్: తనకు ది డ్యాన్స్ ఇండియా యంగ్ టీచర్ అవార్డ్ లభించిందని నగరానికి చెందిన కూచిపూడి నృత్య కళాకారిణి భాగవతుల సౌమ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ది డ్యాన్స్ ఇండియా మాస పత్రిక ప్రతీ ఏటా సంప్రదాయ నృత్యంలో విశేషమైన కృషి చేసిన వారికి యంగ్ టీచర్ పురస్కారంతో సత్కరిస్తుందన్నారు. 2023 సంవత్సరానికి గానూ అంతర్జాతీయ నృత్యదినోత్సవం సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డ్‌ను ప్రదానం చేశారని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ జీవన్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నాట్యశాఖ ప్రొఫెసర్ వనజా ఉదయ్, ది డ్యాన్స్ ఇండియా మాసపత్రిక సంపాదకుడు బత్తిన విక్రమ్‌కుమార్, సహ సంపాదకురాలు కిర్మణయి బోనాల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. భాగవతుల సౌమ్య సంప్రదాయ కూచిపూడి నృత్య కుటుంబానికి చెందిన వారు. ఘంటసాల సంగీత కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. ఆమెను సంగీత కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఇతర నాట్యాచార్యులు అభినందించారు.







● జోరువానతో బెంబేలు

జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు, ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకుని భారీగా వర్షం కురుస్తుండడంతో పంటను కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

విద్యతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విద్యతోనే రాష్ట్రాభివృద్ధి సాధిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కేఎల్ రావు నగర్ రాకేష్ పబ్లిక్ స్కూల్ 38వ వార్షికోత్సవం స్కూల్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ ఎన్వీ రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వెలంపల్లి, నగర మేయర్ భాగ్యలక్ష్మి, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు విచ్చేశారు. తొలుత అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అంతరిక్ష వ్యోయగామి రాకేష్ శర్మ పేరిట ఏర్పాటు చేసి స్కూల్ అద్భుతమైన విద్యా ప్రమాణాలతో ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దుతుందన్నారు. నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆర్. శివరాంప్రసాద్ మాట్లాడుతూ.. బాల్యంతో నేర్చుకున్న సంస్కారాలు బతుకుంతా ఉంటాయన్నారు. వక్ఫ్‌బోర్డు స్పెషల్ ఆఫీసర్ షేక్.షిరీన్‌బేగం, తక్షశిల ఐఏఎస్ అకాడమీ బీఎస్ఎం దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భార్యను అనుమానిస్తూ శారీరకంగా, మానసికంగా వేధిస్తోన్న భర్తపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. విద్యాధరపురం రామరాజ్యనగర్‌కు చెందిన మేచర్ల కోటమ్మకు బాబూరావుతో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. ఆమె భర్త మద్యానికి బానిసయ్యాడు. నిత్యం తాగి రావడం భార్యను అనుమానించి శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. కూలి పనుల ద్వారా వచ్చిన డబ్బులు మద్యం తాగేందుకు ఇవ్వాలని ఆమెను ఇబ్బందులు పెడుతున్నాడు. ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో ఆమె ఇంట్లో నిద్రపోతుండగా బ్లేడ్‌తో దాడి చేశాడు. దీనిపై బాధితురాలు కోటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు శ్రీకారం



రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు పూజ చేసిన కార్పొరేటర్ మాధురి లావణ్య తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం 45వ డివిజన్ పరిధిలోని రాము క్వారీ కొండ ప్రాంతంలో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య ఆదివారం కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాము క్వారీ కొండపైన గతంలో కురిసిన వర్షానికి రిటైనింగ్ వాల్ కూలిపోయిన కారణంగా స్థానికుల రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. సమస్యను స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లానని చెప్పారు. ప్రజా సమస్యలపై వెంటనే స్పందించే ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి రిటైనింగ్ వాల్ నిర్మాణానికి మంజూరు చేయించిన రూ.19 లక్షలతో ఈ రోజు నిర్మాణ పనులను ప్రారంభించామని తెలిపారు. ఇప్పటికే కొండ ప్రాంతంలో చాలా వరకు మెట్లు, డ్రెయిన్లను నిర్మించామని, డివిజన్ ప్రజలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకువస్తే ఎమ్మెల్యే వెలంపల్లి సహకారంతో పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ బాధ్యులు మైలవరపు కృష్ణ, స్థానిక పార్టీ నాయకులు ముత్తా వాసు, బైపినేని కోటేశ్వరరావు, బోర మల్లేశ్వరరెడ్డి, పీతల నాగు, డి.రాము, కాంట్రాక్టర్ బాలకృష్ణ, స్థానికులు పాల్గొన్నారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం



యోగా గురువు అంకాల సత్యనారాయణను సత్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నిత్యం యోగ సాధన చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పొందవచ్చునని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు చెప్పారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఆవరణలోని అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా ఉచిత శిక్షణా తరగతులను ఆదివారం ఉదయం ఢిల్లీరావు ప్రారంభించారు. యోగ సాధకులతో కలిసి ఢిల్లీరావు కొద్దిసేపు యోగాసనాలు, ప్రాణాయామం ప్రాక్టీస్ చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ యోగా వల్ల ఆరోగ్యంతో పాటుగా క్రమశిక్షణ, సమయపాలన, మానసిక ప్రశాంతత పొందవచ్చునని చెప్పారు. జిల్లాలోని 257 ఆరోగ్య కేంద్రాల్లో కూడా వివిధ రకాల వైద్య విధానాలతో పాటుగా యోగాను కూడా ఒక అంశంగా చేర్చామని ఢిల్లీరావు చెప్పారు. ప్రపంచంలోని పాశ్చాత్య దేశాలల్లో సైతం యోగాను సర్వరోగ నివారిణిగా భావిస్తున్నారని చెప్పారు.

అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎక్కువ మందికి యోగాను పరిచయం చేసేందుకు ప్రతి ఏడాది వేసవిలో ఉచిత శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. యోగా గురువు అంకాల సత్యనారాయణ మాట్లాడుతూ యోగ సాధన వల్ల దీర్ఘకాలిక వ్యాధులను సైతం మందులు ఉపయోగించకుండా అదుపులో ఉంచుకోవచ్చునన్నారు. నెల రోజుల పాటు ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు ఈ యోగా శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ కూడా అందజేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ యోగా లీగ్ చీఫ్ కో–ఆర్డినేటర్ జీ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యోగ ప్రాధాన్యతను ప్రపంచం మొత్తం గుర్తించడం మన దేశానికి గర్వకారణమన్నారు. అసోసియేషన్ సభ్యులు చుక్కపల్లి అరుణ్‌కుమార్, మిరియాల వెంకటేశ్వరరావు, యల్లారావుతో పాటుగా వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, యోగా సాధకులు పాల్గొన్నారు. సభ అనంతరం యోగా గురువు అంకాల సత్యనారాయణను ఢిల్లీరావు సత్కరించారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మానసిక ప్రశాంతతకు ధ్యానం అవసరమని, ప్రతి ఒక్కరూ ధ్యాన సాధన చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ అన్నారు. ఆదివారం బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ధ్యానంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జమల పూర్ణమ్మ మాట్లాడుతూ ప్రతి రోజూ 10 నిమిషాల పాటు ధ్యానం చేయాలన్నారు. ధ్యాన శిక్షణ అధ్యాపకురాలు నామన సత్య రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. ధ్యానం వలన వ్యర్థమైన ఆలోచనలు, వ్యసనాలు పోతాయన్నారు. విద్యార్థుల చేత ధ్యానం చేయించారు. గ్రంథాలయాధికారి కె.రమాదేవి, గ్రేడ్–3 గ్రంథ పాలకురాలు వై.ధనలక్ష్మి, సిబ్బంది కె.రాంబాబు, గోపాలరావు, దుర్గాంబ పాల్గొన్నారు.

గుర్తుండిపోయేలా గొల్లపూడి రుద్రభూమి

రూ.కోటితో ఆధునికీకరణ



హిందూ శ్మశానవాటికను ప్రారంభిస్తున్న కృష్ణమూర్తి, సుబ్బారావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలో కృష్ణానదీ తీరాన పుష్కరఘాట్ పక్కనేగల హిందూ శ్మశానవాటికను స్థానిక మాజీ సర్పంచ్ బొమ్మసాని కృష్ణమూర్తి, గ్రామ పెద్ద కంఠమనేని వెంకట సుబ్బారావులు ఆదివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అధునాతన సౌకర్యాలతో నిర్మాణ కమిటీ సభ్యులు తీర్చిదిద్దిన ఈ శ్మశానవాటిక తరతరాలు గుర్తుంచుకునేలా ఉందన్నారు. మృతదేహంతో పాటు ఇక్కడికి వచ్చే బంధువులు, స్నేహితులు దీనిని చూస్తే శ్మశాన వైరాగ్యం కలగదన్నారు. కృష్ణానది ఒడ్డున ఆహ్లాదకరమైన వాతావరణంలో అధునాతన సౌకర్యాలతో శ్మశానవాటికను తీర్చిదిద్దిన నిర్మాణ కమిటీ సభ్యులను ప్రశంసించారు. హిందూ శ్మశానవాటిక నిర్మాణ కమిటీ సభ్యులు ఏఎంసీ చైర్మన్ కారంపూడి సురేష్, గంగవరపు శివాజీ మాట్లాడుతూ సుమారు 60 సెంట్లలో ఉన్న ఈ రుద్రభూమిని ఆధునికీకరించేందుకు గ్రామ పెద్దలు ఇచ్చిన భూరీ విరాళాలతోపాటు కొంత పంచాయితీ నిధులను జోడించామని తెలిపారు. మొత్తం మీద శ్మశానవాటిక అభివృద్ధికి సుమారు కోటి రూపాయల వరకు వెచ్చించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శివనాగిరెడ్డి, వైస్ ఎంపీపీ సురేష్, సహకార బ్యాంక్ చైర్మన్ వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యుడు చౌదరి, నాయకులు జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

నదిలో దూకిన వ్యక్తిని కాపాడిన ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కృష్ణానదిలో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తిని ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది కాపాడి ఆదివారం ఒడ్డుకు చేర్చారు. నగరంలోని ఎల్‌బీఎస్ నగర్ ప్రాంతానికి చెందిన పులుపు వెంకటేష్(34) వ్యక్తిగత సమస్యలతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఆదివారం సాయంత్రం ప్రకాశం బ్యారేజ్ మీదకు చేరుకొని కృష్ణా నదిలోకి దూకాడు.. పాదచారుల ద్వారా సమాచారం అందుకున్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది నదిలోకి దూకి వెంకటేష్‌ను కాపాడి ఒడ్డుకు తీసుకొచ్చారు. అనంతరం వెంకటేష్‌ను వన్‌టౌన్ పోలీసులకు తరలించి, అతని కుటుంబ సభ్యులను పిలిపించి అప్పగించారు.

బాబా ఆశీస్సులతో లక్ష్యాలు చేరుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీషిర్డీ సాయిబాబా ఆశీస్సులు ప్రతీ ఒక్కరికీ అందాలని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని అందుకు అనుగుణంగా ముందుకు సాగాలని మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతమ్‌రెడ్డి అన్నారు. స్థానిక ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం ఇంటర్మీడియెట్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన ఎస్.వైష్ణవితో సహా అత్యుత్తమ మార్కులు సాధించిన మరో నలుగురు విద్యార్థులను బాబావారి శేషవస్త్రం, చిత్రపటంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో వైష్ణవి 466 మార్కులు సాధించి నగరానికే గర్వకారణంగా నిలిచిందన్నారు. అలాగే జి.భువనేశ్వరి 458, భారతి 453, పి.లాస్య 455 మార్కులు సాధించగా బైపీసీ విద్యార్థి ఎన్‌డీఎస్ సుదీప్తి 436 మార్కులు సాధించటం అభినందనీయం అన్నారు. నిరుపేద విద్యార్థులకు పరీక్ష ఫీజులు చెల్లిస్తున్నామని తెలిపారు. అనంతరం బాబావారి ఆలయం అర్చకులు దివంగత శ్రీనివాసరావు ద్వితీయ కుమారుడు కళాశాల ఫీజుకు రూ.38వేలు అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు, కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి, సభ్యులు యాదల శ్రీనివాసరావు పాల్గొన్నారు.